e
ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

WWW.GAYATHRINEWS.COM
APTEL/26/A3646

# గాయత్రి న్యూస్

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ ఆదివారం 31-05-2026 సంపుటి : 1 సంచిక :07 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## ఆ రాష్ట్రంలో కరెంట్ బిల్లులపై 10శాతం ఇంధన సర్‌ఛార్జ్..

- ఇంధన సంక్షోభం వేళ.. ప్రజలపై మరోకొత్త భారం పడేలా కనిపిస్తోంది. జూన్‌నెలకు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎలక్ట్రిసిటీ బిల్లులు పెరగనుండటమే ఇందుకు కారణం. కరెంట్ బిల్లులపై 10శాతం ఇంధన సర్‌ఛార్జ్‌ను విధిస్తున్నట్లు ఉత్తర్‌ప్రదేశ్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ శనివారం నోటిఫికేషన్ జారీచేసింది. జూన్ బిల్లింగ్ సైకిల్‌లో అన్ని వర్గాల వినియోగదారులకు ఈ ఛార్జి వర్తించనుంది.



## ఇరాన్‌తో డీల్.. సంతకం చేయని ట్రంప్

**పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభం ఇప్పుడప్పుడే ముగిసేలా కన్పించట్లేదు.**


ఇరాన్‌తో తాత్కాలిక ఒప్పందంపై తుది నిర్ణయం తీసుకునేందుకు శ్వేతసౌధం సిచ్యువేషన్ రూమ్‌లో ట్రంప్ తన సలహాదారులతో సమావేశమయ్యారు. దాదాపు రెండు గంటలపాటు వీరి మధ్య చర్చలు జరిగాయి. అయినప్పటికీ.. ఒప్పందంపై ఎలాంటి పురోగతి లేదు.



# గొడ్డలి పార్టీ అంశం... సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోంది

**“నియోజకవర్గాల పునర్విభజన, మహిళా బిల్లులపై కేంద్రం పట్టుదలగా ఉంది. ఇవి దేశ రాజకీయాల్లో పెనుమార్పులు తీసుకొస్తాయి. రెండు బిల్లులను విడదీసి చూడాల్సిన అవసరం లేదు. బిల్లులను గతంలో వ్యతిరేకించిన వారి ఆలోచనలు ఇప్పుడు మారొచ్చు.**

అమరావతి: గొడ్డలి పార్టీ అని ప్రజల్లోకి వెళ్లే కొద్ది సైకోలో ఫ్రస్టేషన్ పెరుగుతోందని సీఎం చంద్రబాబు విమర్శించారు. సైకో కంటే గొడ్డలి పార్టీ అనే అంశాన్ని ప్రజలు బాగా గుర్తించారని చెప్పారు. ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. “వెలుగులోకి వస్తున్న వైఎస్ కుటుంబ అరాచకాలు నాకు కూడా తెలియవు. ప్రజాస్వామ్యానికి ఇలాంటి వాళ్లు పనికిరారు. మావోయిస్టులు తుపాకులతో రాజ్యాధికారాన్ని సాధించలేరు. వీళ్లు మాత్రం గొడ్డలితో ఎలా రాజకీయాలు చేస్తారు? వివేకా హత్య కేసులో సునీత పోరాటంలో న్యాయం ఉంది. తన తండ్రిని ఎవరు చంపారో తెలుసుకునే హక్కు ఆమెకు ఉంది.ఎక్కువ సభ్యత్వాలు చేయించిన వారికి రాహుల్‌గాంధీతో సన్మానం చేయించాం”అని రేవంత్ అన్నారు.ఆమె పోరాటం వల్లే ఇప్పటికీ ఆ హత్య కేసు సజీవంగా ఉంది. నేటి తరానికి కూడా వీళ్ల హత్యా రాజకీయాలు తెలుస్తున్నాయి”





## డీఎస్సీ నిర్వహణపై ఆరోపణలు అవాస్తవం

**కోన శశిధర్**

“డీఎస్సీలో 16,347 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చాం. 3.36 లక్షలమంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. 154 టీసీఎస్ అయాన్ సెంటర్లలో, 89 సెషన్లలో పరీక్షలు నిర్వహించాం. 15,941 మందికి నియామకపత్రాలు ఇచ్చాం. డీఎస్సీపై 226 కేసులు వేసినా.. రికార్డు సమయంలో 148 రోజుల్లోనే నియామకాలు పూర్తి చేశాం. డీఎస్సీలో టెట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. తొలిసారి ఎస్సీ సబ్‌క్లాసిఫికేషన్, హారిజాంటల్ రిజర్వేషన్లు అమలు చేశాం. అక్రమాలకు తావులేకుండా ప్రతీది ఆన్‌లైన్ విధానంలో చేశాం. 24 రోజులపాటు వేర్వేరు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించడం వల్ల నార్మలైజేషన్ చేశాం.

## సీబీఎస్ఈ మార్కుల గందరగోళంపై విద్యార్థుల పోరాటం స్ఫూర్తిదాయకం



తెలంగాణలో 2019 ఇంటర్ ఫలితాలను తారుమారు చేసిన గ్లోబరీనా అనే సంస్థ.. తన పేరు మార్చుకుని, సీబీఎస్ఈ నుంచి కాంట్రాక్టును దక్కించుకుని, అంతకంటే పెద్ద గందరగోళాన్ని సృష్టించిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు.

## జీవీఎంసీ, ఎంఎంసీలలో వార్డుల పునర్విభజనపై హైకోర్టు స్టే




గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ), మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)లలో వార్డుల పునర్విభజన ప్రక్రియపై హైకోర్టు పరిమితకాలానికి స్టే ఇచ్చింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది.


## ఇకపై 10 రోజులకోసారి కార్యకర్తలను కలుస్తా

**పీఏసీ సమావేశంలో ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి చురక**

ఇకపై క్షేత్రస్థాయి కార్యకర్తలను తాను 10 రోజులకోసారి కలుస్తానని.. నెలలో మూడు రోజులు వారి కోసం సమయం కేటాయిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అందరూ పార్టీ కోసం కష్టపడి పనిచేయాల్సిందేనన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన కాంగ్రెస్ రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. “మంత్రులు.. తాము ఇన్‌ఛార్జిగా ఉన్న జిల్లాకు ప్రతి 10 రోజుల్లో ఒకరోజు వెళ్లి.. పార్టీ కార్యక్రమాల కోసం పూర్తిగా సమయం కేటాయించాలి.



## మంత్రాలయం వద్ద తుంగభద్రలో ఐదుగురు గల్లంతు



తుంగభద్ర నదిలో ఈతకు వెళ్లి ఐదుగురు గల్లంతయ్యారు. కర్నూలు జిల్లా మంత్రాలయం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది..

## తితిదేకు భారీ విరాళం అందించిన నీరా రాడియా



ధర్మరథం బస్సులు 380 ట్రిప్పుల ద్వారా 21 బస్ స్టాప్‌లలో భక్తులకు సేవలందిస్తున్నాయని తెలిపారు.

## జిందాల్ ‘వేస్ట్ టు ఎనర్జీ’ ప్లాంట్‌ను పరిశీలించిన పవన్ కల్యాణ్

- నాయుడుపేటలోని జిందాల్ ‘వేస్ట్ టు ఎనర్జీ’ ప్లాంట్‌ను ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సందర్శించారు. ఈ ప్లాంట్‌లో చెత్త నుంచి విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నారు.
- స్వచ్ఛ గోదావరిపై జూన్ 25 నాటికి పూర్తిస్థాయి నివేదిక
- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్



గుంటూరు: ఈ క్రమంలోనే ప్లాంట్ ఏర్పాటు వ్యయం, నిర్వహణ గురించి పవన్ ఆరా తీశారు. విద్యుత్ ఉత్పత్తి, యూనిట్ విక్రయ ఛార్జీలను ప్లాంట్ ప్రతినిధులు ఆయనకు వివరించారు. కాకినాడ జిందాల్ ప్లాంట్ ఇంకా ఎందుకు వినియోగంలోకి రాలేదని డిప్యూటీ సీఎం ప్రశ్నించగా.. నవంబరు లోపు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

# సమిష్టి కృషితో మహానాడు విజయవంతం

**- మహానాడు విజయానికి కృషి చేసిన పలువురుకు సన్మానం**
**- స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి**
**- టిడిపి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పిలుపు**

గాయత్రి న్యూస్
ఈ నెల 27, 28 తేదీల్లో తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డిజిటల్ మహానాడు విజయవంతం కావడంతో రామచంద్రపురం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఉండవల్లి శివ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్-1 ఇన్‌చార్జి మేడిశెట్టి సూర్యనారాయణ, సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, కట్టా నాగేశ్వరరావు, దంగేటి గౌరీశంకర్, నారపురెడ్డి బలరాం, పొనకల చంటి, అల్లం శ్రీనివాస్, బళ్ల లక్ష్మీ, వజ్రపు రాజేశ్వరి, దోమలపాటి విజయలక్ష్మి,



ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో డిజిటల్ మహానాడు అత్యంత వైభవంగా నిర్వహించడంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టి కృషి కీలక పాత్ర పోషించిందన్నారు. ముఖ్యంగా క్లస్టర్-1 పరిధిలో అత్యధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొనడం వల్ల ప్రత్యేక గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో నియోజకవర్గంలోని 10 క్లస్టర్ల నుంచి అంచనాలకు మించి పార్టీ శ్రేణులు మహానాడుకు హాజరుకావడం విశేషమన్నారు. పార్టీ పట్ల కార్యకర్తల్లో ఉన్న నిబద్ధత, నాయకత్వంపై ఉన్న విశ్వాసానికి ఇది నిదర్శనమని తెలిపారు. మహానాడు విజయవంతం కావడానికి కృషి చేసిన పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలను వాసంశెట్టి సత్యం చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. వారి సేవలను అభినందిస్తూ భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

### వాసంశెట్టి సత్యంకు ఘన సన్మానం

అనంతరం పట్టణ అధ్యక్షుడు ఉండవల్లి శివ ఆధ్వర్యంలో వాసంశెట్టి సత్యంను పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. మహానాడు విజయవంతం కావడంలో ఆయన అందించిన మార్గదర్శకత్వం, సమన్వయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో ప్రతి కార్యకర్త చురుగ్గా పాల్గొని తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పాడ గ్రామంలో ప్రమాద బాధిత కుటుంబాలకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం

**- భరోసా కల్పించిన జనసేన నాయకులు**

గాయత్రి న్యూస్
పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం తరపున రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సహాయ చెక్కులు అందజేశారు. ఇటీవల ఉప్పాడ గ్రామానికి చెందిన కొందరు మహిళలు జీవనోపాధి కోసం చేపల విక్రయ నిమిత్తం సామర్లకోటకు వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళతో పాటు ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందడం తీవ్ర విషాదానికి దారితీసింది. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను పాడా పిడి శివరాం ఆధ్వర్యంలో పిఠాపురం ఫైవ్ మాన్ కమిటీ సభ్యులు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్,కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు,డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు),మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు,ఓదూరి కిషోర్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల భవిష్యత్తుపై ఆందోళన చెందవద్దని,జనసేన పార్టీ పూర్తిగా అండగా నిలుస్తుందని తెలిపారు. ముఖ్యంగా మృతుల పిల్లల విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని పనిచేస్తోందని,ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలబడటమే ప్రభుత్వ లక్ష్యమని నాయకులు తెలిపారు. తక్షణ ఆర్థిక



సహాయం ద్వారా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజల పట్ల ఉన్న బాధ్యతాయుత నాయకత్వాన్ని మరోసారి చాటిచెప్పారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్లు సూరిశెట్టి జయకృష్ణ,దానం లాజర్ బాబు,పెంకే జగదీష్,కంచర్ల భవాని శంకర్,వంకా కొండబాబు, మొగలి అప్పారావు,నక్కా నారాయణమూర్తి,మార్కెట్ కమిటీ చైర్మన్ వాకపల్లి దేవి సూర్య ప్రకాష్, స్థానిక నాయకులు,కార్యకర్తలు,ప్రజాప్రతినిధులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపీ పీ.జీ సెట్ -2026 లో అత్యుత్తమ ర్యాంకులతో ఆదిత్య డిగ్రీ మరియు పీ .జీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

**- గణితంలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన కాళ్ళకూరి నరేంద్ర శర్మ ను అభినందిస్తున్న డాక్టర్ నాయుడు**

గాయత్రి న్యూస్
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర పీ.జీ ప్రవేశ పరీక్ష - 2026 లో గణితశాస్త్ర విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడమే కాకుండా వివిధ సబ్జెక్టులలో పది లోపు 8 ర్యాంకులు సాధించిన ఆదిత్య మరియు పీ . జీ కళాశాలల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆదిత్య డిగ్రీ మరియు పీ .జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పీ.జీ ప్రవేశ పరీక్ష--2026 లో వివిధ సబ్జెక్టుల్లో టాప్ ర్యాంకులు సాధించిన ఆదిత్య డిగ్రీ మరియు పీ .జీ కళాశాల విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు అభినందించారు. 1 నుండి 10 లోపు గణితశాస్త్ర విభాగం నుండి స్టేట్ ప్రథమ ర్యాంకు కాళ్ళకూరి నరేంద్ర శర్మ , 2వ ర్యాంకు బాల ఫణీన్ద్ర కుమారి, 4వ ర్యాంకు కె జ్యోతిక , డి . అమృత సాయి వల్లి , 6వ ర్యాంకు ఏం. నాగ దుర్గ , 7వ ర్యాంకు కె . మహా లక్ష్మి , 8వ ర్యాంకు ఎస్ భవాని మరియు బి.ఎస్. సి కంప్యూటర్ సైన్స్ విభాగం నుండి 8వ ర్యాంకు సి . గీత నందిని ర్యాంకులు



సాధించారు మరియు 11 నుండి 100 లోపు గణితశాస్త్ర విభాగంలో విభాగం నుండి 17 , కంప్యూటర్ సైన్స్ విభాగం నుండి 21, స్టాటిస్టిక్స్ విభాగం నుండి 6, బి.ఎస్. సి కెమిస్ట్రీ విభాగం నుండి 4, ఇంగ్లీష్ విభాగం నుండి 3, లైఫ్ సైన్స్ విభాగంలో 2, కామర్స్ విభాగం నుండి 3 ర్యాంకు లను ఆదిత్య డిగ్రీ మరియు పీ .జీ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డా. ఎన్ శేషారెడ్డి టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను అభినందించారు. ఈ సందర్భంగా అకడమిక్ డైరెక్టర్ డా. బి.ఈ.వి.ఎల్. నాయుడు ర్యాంకర్లను అభినందించి మాట్లాడుతూ క్యాంపస్ ఇంటర్వ్యూ లలో 100 శాతం ఉద్యోగాలు సాధించడమే కాకుండా , ఏపీ పీ.జీ ప్రవేశ పరీక్షలలో ఉత్తమ ర్యాంకులు సాధించి అగ్రగామిగా నిలిచారని అన్నారు .ఈ సందర్భంగా గణిత శాస్త్ర విభాగం లో మొదటి ర్యాంక్ సాధించిన కాళ్ళకూరి నరేంద్ర శర్మ ను టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మరియు శిక్షణ నిచ్చిన అధ్యాపకులను ఆదిత్య విద్యా సంస్థల సెక్రటరీ డా. ఎన్ సుగుణా రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ , వైస్ ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు అభినందించారు.

# పాలకొల్లులో ఎస్ఐఆర్ అవగాహన సదస్సులో పాల్గొన్న నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి



గాయత్రి న్యూస్
వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు,పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఫంక్షన్ హాల్‌లో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ ఎస్ఐఆర్ పై కీలక సూచనలు చేశారు. బూత్ స్థాయి వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని,ప్రతి బిఎల్ఏ సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఖచ్చితంగా పర్యవేక్షించాలని ఆయన సూచించారు. అలాగే ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రతి ఓటరు వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు,నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరు ఉమా బాల,జిల్లా టాస్క్ ఫోర్స్ హెడ్ యనమల నాగార్జున యాదవ్,మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు తదితర నాయకులు,ప్రజాప్రతినిధులు,బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# 15 ఏళ్ల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

**- వీరన్నపాలెంలో నూతన మంచినీటి ట్యాంకులను ప్రారంభించిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు**

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్
బుట్టాయిగూడెం మండలం వీరన్నపాలెం గ్రామంలో దశాబ్దకాలంగా కొనసాగుతున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ నూతనంగా ఏర్పాటు చేసిన మంచినీటి ట్యాంకులను పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు శనివారం



ప్రారంభించారు. గ్రామ ప్రజలు తమకు త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన అధికారులతో సమన్వయం చేసి కేవలం వారం రోజుల వ్యవధిలోనే త్రాగునీటి సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం విశేషం. గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు గ్రామస్థులు, మహిళలు, యువకులు ఘన స్వాగతం పలికి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. నూతన మంచినీటి ట్యాంకులను ప్రారంభించిన అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా జీవించేలా తాగునీరు, రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే స్పందించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని, వీరన్నపాలెం గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారం అందుకు నిదర్శనమని అన్నారు. అలాగే గ్రామంలో ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న ఓ నిరుపేద వ్యక్తికి ఎమ్మెల్యే స్వయంగా ఆర్థిక సహాయం అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు. గ్రామ యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షిస్తూ క్రికెట్ కిట్ కొనుగోలుకు నగదు సహాయం అందించారు. యువత క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని, గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. పోలవరం నియోజకవర్గంలోని ప్రతి గ్రామ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాల్లో 'జన్ మన్' విద్యుత్ వెలుగులు

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్





విద్యుత్ సౌకర్యం లేని మారుమూల గిరిజన గ్రామాలకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు విద్యుత్ వెలుగులు తీసుకువచ్చారు. ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్(పిఎం జన్ మన్) పథకం లో బాగంగా కుక్కునూరు మండలంలోని రావి గూడెం పంచాయతీ లోని చీపురు గూడెం గ్రామంలో 65 లక్షల రూపాయలతో 13కిలోవాట్స్, బండారు గూడెం గ్రామం లో 12ఖౌ సోలార్ ఆఫ్ గ్రిడ్ ఏర్పాటుచేసి అక్కడ ఉన్న 85 ఆదివాసి కుటుంబాలకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ విద్యుత్ సౌకర్యం కల్పించారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ పి . సాల్మన్ రాజు కుక్కునూరు మండలం చీపురుగూడెం లో సోలార్ ఆఫ్ గ్రిడ్ ను ప్రారంభించారు. ఇప్పటివరకు విద్యుత్ వెలుగులు ఎరుగని ఆ మారుమూల గిరిజన గ్రామాల ప్రజలు తమ గ్రామాలకు పిఎం జన్ మన్ పథకం ద్వారా విద్యుత్ సౌకర్యం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జిల్లా ఇంచార్జ్ మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి లకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్కో డీఈ ఖాన్, ఏడిఈ కట్టా రమేష్, స్థానిక కూటమి పార్టీల నాయకులు ప్రభృతులు పాల్గొన్నారు. 85 కుటుంబాల ఆదివాసి లకు ఏపిఈపిడిసిఎల్ సుమారు 65లక్షల రూపాయలతో ఈ సోలార్ గ్రిడ్ ను శనివారం ఏలూరు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీ పి. సాల్మన్ రాజు ప్రారంభం చేసి అక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. వారు విద్యుత్ సౌకర్యం కల్పించినందుకు ఆనందం తో అధికారులను సత్కరించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ పీర్ అహ్మద్ ఖాన్ గారు, జిలుగు మిల్లీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీ కట్టా రమేష్ గారు , కుక్కునూరు అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీ మీసాల పాపరావు మరియు విద్యుత్ శాఖ సిబ్బందికి మండల లితెలుగుదేశం కుక్కునూరు మండల అధ్యక్షులు ములిశెట్టి నాగు,రావి గూడెం గ్రామ నాయకులు భాగం శ్రీనివాసరావు, సుబ్రమణ్య శాస్త్రి , కుంజా రమేష్ , పిచ్చుక రాజు, రమణరాజు, ఉదయ్ తదితర నాయకులు పాల్గొని విద్యుత్ శాఖాధికారులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ కి కృతజ్ఞతలు తెలిపారు

# పెట్రోల్,డీజిల్ ధరలు తగ్గించాలి

**- సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుల డిమాండ్**
**- తహశీల్దార్ కు వినతిపత్రం అందజేత**

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్






దేశవ్యాప్తంగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలు, ప్రజలు వాడుకునే నిత్యవసర వస్తువులు ధరలను తగ్గించాలని కోరుతూ, మండల కేంద్రాలలో.. ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపులో భాగంగా, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కుకునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మే 30న కుక్కునూరు మండల తహసిల్దార్ గారిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్కే గౌస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి లీటరుకు 8 రూపాయలు దేశ ప్రజలపై భారం మోపిందని,14 ఏళ్ల క్రితం వంటగ్యాస్ 400 రూపాయలు ఉన్న ధర 1100 కు, పెట్రోల్ 65 నుండి 110 రూపాయలు, డీజిల్ 41 నుండి 95 రూపాయలు, వంట నూనె 90 నుండి 190, కందిపప్పు 70 నుండి 160, గోధుమపిండి 18 రూపాయల నుండి 38, ఉల్లి, టమాట ఇతర కూరగాయలు 200 శాతం పెరిగాయి. కాంప్లెక్స్, రసాయనిక ఎరువులు బస్తాకు 200 రూపాయలు పెరిగాయి. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధర రావడం లేదని ఎంఎస్ పి చట్టం కొరకు రైతులు ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కోరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి కంగాల కల్లయ్య, పార్టీ డివిజన్, మండల కమిటీ సభ్యులు ఎస్కే మున్ని, పెంకె వీరబాబు, మడకం మల్లేష్, మచ్చ ముత్తమ్మ, పి దుర్గమ్మ,ఎం. వెంకటేశ్వర్లు ఎం.రాములు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం నుండి యూరియా అందుబాటులో

**- చైర్మన్ భాస్కర్ ముదిరాజ్**

తొట్టంబేడు, మే-30, గాయత్రి న్యూస్:రిపోర్టర్ : మునిరత్నం



తొట్టంబేడు మండలంలోని తంగేళ్లపాలెం సింగల్ విండో బ్యాంకు చైర్మన్ భాస్కర్ ముదిరాజ్ శనివారం విలేకరులతో మాట్లాడారు.తొట్టంబేడు మండలంలోని రైతులకు ఈ సోమవారం నుంచి యూరియా అందుబాటులో ఉంటుందని చైర్మన్ భాస్కర్ ముదిరాజ్ తెలిపారు.ఖరీఫ్ పంటల సాగు దృష్ట్యా రైతులందరూ సకాలంలో యూరియా తీసుకొని ఉపయోగించుకోవాలని కోరారు.తంగేళ్లపాలెం సింగల్ విండో బ్యాంకు ద్వారా రైతులకు అవసరమైన మేర యూరియా పంపిణీ చేస్తామన్నారు.రైతులు తమ పాస్‌బుక్, ఆధార్ కార్డు తీసుకొని బ్యాంకుకు రావాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందిస్తామని, దళారులను నమ్మి మోసపోవద్దని భాస్కర్ ముదిరాజ్ ఈ సందర్భంగా తెలిపారు.

# అన్నవరం దేవస్థానంలో భక్తుల సౌకర్యాలపై ట్రస్ట్ బోర్డు సభ్యుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి పర్యవేక్షణ

**- అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ దృష్ట్యా ట్రస్ట్ బోర్డు సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టారు.**
**- పర్యవేక్షణలో చేపట్టిన చర్యలు**





గాయత్రి న్యూస్

వ్రత మండపంలో: సామాన్య భక్తులతో నేరుగా మాట్లాడి వ్రత సమయంలో వారు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. వ్రత మండపం సిబ్బందికి భక్తులకు మెరుగైన సేవలు అందించేలా సూచనలు, సలహాలు ఇచ్చారు.- సీసీ కెమెరాల పర్యవేక్షణ: శనివారం రద్దీ నేపథ్యంలో ఆలయ సీసీ కెమెరాలను పరిశీలించి, భక్తులు క్యూ లైన్లలో ఎక్కువసేపు వేచి ఉండకుండా త్వరగా స్వామివారి దర్శనం అయ్యేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.- డిజిటలైజేషన్ & ఆన్‌లైన్ పేమెంట్స్ పరిశీలన: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అన్నవరం దేవస్థానాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయడంతో పాటు ఆన్‌లైన్ పేమెంట్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈ నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ పేమెంట్స్, టికెట్ బుకింగ్స్, వ్రత టికెట్లు సజావుగా జరుగుతున్నాయా లేదా అని నాగేంద్ర చౌదరి స్వయంగా పరిశీలించారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సిబ్బందిని అప్రమత్తం చేశారు.- కొండ దిగువ టోల్‌గేట్: ఇటీవల ఆటో బోల్తా పడిన సంఘటన దృష్ట్యా టోల్‌గేట్ సిబ్బందితో నాగేంద్ర చౌదరి మాట్లాడారు. మళ్లీ అలాంటి ప్రమాదాలు జరగకుండా ఒక ఆటోలో నలుగురికి మించి ప్రయాణించకుండా చూడాలని, టోల్‌గేట్ వద్ద వాహనాలు ఎక్కువసేపు నిలపకుండా త్వరగా పంపించాలని సిబ్బందికి సూచించారు.- పల్లకీ సేవ: శనివారం జరిగిన స్వామివారి పల్లకీ సేవ దగ్గరుండి పర్య వీక్షించిన పాలచర్ల నాగేంద్ర చౌదరి పాల్గొన్నారు. కొండ పైన ఉన్న దుకాణాలను పర్యవేక్షించి అధిక ధరలు వికరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు ప్రతి షాప్ దగ్గర ధరల పట్టిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారికి సూచించారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని, భక్తుల భద్రత, సౌకర్యమే ప్రధానమని ఆయన సిబ్బందికి తెలిపారు.

# మల్లిశాల రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన

**- జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్**

గాయత్రి న్యూస్



ప్రమాద వివరాలు మల్లిశాల గ్రామానికి చెందిన పలువురు విహారయాత్ర ముగించుకొని వస్తుండగా కొత్తపల్లి వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు.మృతులు కందికట్ల లక్ష్మీ, కొండేపూడి వివేక్, దిమ్మల పద్మిని అకాల మరణం చెందారు. పరామర్శ కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ బాధిత కుటుంబాలను నేరుగా కలిసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
- ప్రభుత్వ భరోసా: బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని విధాలా అండగా నిలుస్తామని, పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు.జ్యోతుల నవీన్ వ్యాఖ్య అకాల మరణాలు అత్యంత బాధాకరం. బాధిత కుటుంబాలకు టీడీపీ అండగా ఉంటుంది. వారికి తోడుగా నిలబడతాం.మరో పరామర్శ ఇదే గ్రామానికి చెందిన నంది కోళ్ల సింగరం ఇటీవల గుండెపోటుతో మరణించడంతో ఆ కుటుంబాన్ని కూడా పరామర్శించి సానుభూతి ప్రకటించారు.పాల్గొన్నవారు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్ వి ఎస్ అప్పలరాజు,ఆత్మ కమిటీ చైర్మన్ పైడిపాల సూరిబాబు, సియాదుల పెద్దకాపు, ఎంపీటీసీ కానవరెడ్డి రామకృష్ణ, ఇందిరపు దుర్గ బాబు, మట్ట శ్రీను, ఇంజరపు రాజు, ఇంజరపు లక్ష్మణ్, భాను, కందికట్ల వీరబాబు, కొండేపూడి వెంకటరమణ, గుడాల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ వజ్రపహార్‌లో భాగంగా కాకినాడ జిల్లా పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**- 22 ద్విచక్ర వాహనాల సీజ్**
**- జిల్లా పోలీస్ కార్యాలయం**

గాయత్రి న్యూస్




జిల్లా ఎస్.పి. జి. బిందుమాధవ్ ముందస్తు ఆదేశాల మేరకు, పెద్దాపురం డి.ఎస్.పీ ఎబిజి తిలక్ పర్యవేక్షణలో సామర్లకోట ఇన్స్పెక్టర్ ఎ కృష్ణ భగవాన్, పోలీస్ స్టేషన్ పరిధిలోని అమ్మానమ్మ అపార్ట్‌మెంట్స్ పరిసరాల్లో శనివారం ఉదయం 06:00 గంటల నుండి భారీ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. 'ఆపరేషన్ వజ్రపహార్' లో భాగంగా జరిగిన ఈ తనిఖీల్లో అత్యాధునిక డ్రోన్ కెమెరాలను ఉపయోగించి నివాస ప్రాంతాలను క్షుణ్ణంగా జల్లెడ పట్టారు. ఈ ఆపరేషన్‌లో సామర్లకోట స్థానిక పోలీసులతో పాటు ఈగల్ టీమ్ సిబ్బంది కూడా చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరైన రికార్డులు, నంబర్ ప్లేట్లు లేని 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని పరిశీలించడంతో పాటు, స్థానిక ప్రజలకు సైబర్ నేరాల పట్ల అవగాహన, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించడం మరియు మత్తు పదార్థాల వల్ల జరిగే దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించారు. అలాగే కాలనీల్లో ఎవరైనా అపరిచిత లేదా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, మత్తు పదార్థాలు సేవించి పట్టుబడితే ఈగల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో తక్షణ పరీక్షలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.

# తంటికొండలో అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గాయత్రి న్యూస్



గోకవరం మండలం తంటికొండ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి తాటేకు పాకలు అగ్రికి ఆహుతి అయినవి.కొత్తగా 3 నెలలు కింద నిర్మించిన ఆకుల సత్తిబాబు టిఫెన్ హోటల్, జొన్నల రాజా కిరాణా షాప్ పూర్తిగా అగ్నికి బూడిదైనవి. శనివారం నాడు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తంటికొండలో బాధితులను పరామర్శించారు. నష్టపోయిన వారికి సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. నష్టపోయిన వారికి ప్రభుత్వపరంగా సహాయం అందించాలని రెవెన్యూ అధికారులు ఆదేశించారు. స్థానిక టిడిపి మండల నాయకులు దాసరి సీతారామకృష్ణ రెండు కుటుంబాలకు వేరువేరుగా రూ. 5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి కన్నబాబు, జగ్గంపేట మార్కెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ అడపా భరత్ కుమార్, గోకవరం మండల కన్వీనర్ పిల్ల చంటిబాబు, తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర, క్లస్టర్ కో -ఇన్చార్జ్ బద్దిరెడ్డి బాబి, మలిరెడ్డి సిరి,బద్దిరెడ్డి రవి, గళ్ళ రాము, నాగం వెంకటపతి, జనసేన నాయకులు మిరియాల గాంధీ, టిడిపి మాజీ ఎంపీటీసీ గెడ్డం బాబు తదితరులు పాల్గొన్నారు.


# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు

అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు తన కెరీర్ గురించి మాట్లాడారు. మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు. సినిమాల విషయంలో ఎప్పుడూ ఒత్తిడికి గురి కాలేదని జగపతి బాబు ఈ సందర్భంగా తెలిపారు. ఫ్యామిలీ ఇష్యూ కాకుండా ఇంకా దేనిని పెద్ద సమస్యగా తీసుకోనని అన్నారు. 'పెద్ది'లో తనకు, రామ్ చరణ్‌కు మధ్య ఉండే బంధం అందరికీ నచ్చుతుందన్నారు. చరణ్ అన్ని సినిమాలకు కష్టపడతారని.. ఈ చిత్రంలో శరీరాకృతిని మార్చుకోవడం కోసం మరింత ఎక్కువ శ్రమించారని చెప్పారు.




# జానపద కథతో 'శక్తి శాలినీ'

'స్త్రీ', 'ముంజ్యా' లాంటి పలు విజయంతమైన చిత్రాలను నిర్మించిన మడాక్ ఫిల్మ్స్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా రాబోతున్న తదుపరి చిత్రం 'శక్తి శాలినీ'. 'సైయారా' విజయంతో సినీప్రియుల్ని మురిపించిన కథానాయిక అనీత్ పడ్డా ఈ సినిమాలో ప్రధానపాత్రలో నటిస్తుంది. ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఇప్పటికే ఈ చిత్రంలో ఆమె ద్విపాత్రాభినయంలో కనిపించనుందని ఎప్పట్నుంచో ప్రచారం జరుగుతుంది. తాజాగా ఈ సినిమా జానపద కథ నేపథ్యంలో రూపొందుతుందని తెలిసింది. "బెంగాలీ పురాణాలలోని ఒక జానపద కథాంశాన్ని ఆధారంగా చేసుకుని ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటివలే ఈ సినిమా భారీ క్లైమాక్స్ ఘట్టాల చిత్రీకరణను కూడా పూర్తి చేశారు. ఈ చిత్రం శక్తి, శాలినిల మధ్య రివెంజ్ డ్రామాగా రూపొందుతుంది. అనీత్ ఇందులో శక్తి అనే రక్షకురాలిగా, ప్రతీకారం తీర్చుకోవాలనే శాలినీ అనే ఆత్మగా ద్విపాత్రాభినయం చేస్తోంది. ఇందులో ఈ రెండు పాత్రల మధ్య జరిగే ఘర్షణ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంద"ని బాలీవుడ్ వర్గాల సమాచారం. ఈ చిత్రంతో పాటు మోహిత్ సూరి దర్శకత్వంలో అహాన్ పాండే సరసన ఓ చిత్రంలో నటిస్తోంది అనీత్.



# జాసన్ సంజయ్ దర్శకుడిగా సిగ్మా

తమిళనాడు సీఎం, తమిళగ వెట్రి కజగం పార్టీ అధినేత విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మొదటి సినిమా 'సిగ్మా' విడుదల తేదీ తాజాగా ఖరారైంది. వైవిధ్యమైన పాత్రలతో మెప్పిస్తున్న టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ మరియు ఫరియా అబ్దుల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం జులై 31న ప్రపంచవ్యాప్తంగా భారీ ఎత్తున థియేటర్లలోకి రానుంది. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎ. సుబాస్కరన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ మైండ్ గేమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మనం కోల్పోయిన దాన్ని తిరిగి అదే స్థానంలో వెతుక్కోవడం, దానికోసం ఎంత మూల్యం చెల్లించాల్సి



వచ్చింది అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని చిత్ర యూనిట్ పేర్కొంది. కెనడాలోని టొరంటో ఫిల్మ్ స్కూల్‌లో ఫిల్మ్ మేకింగ్ కోర్స్ మరియు లండన్‌లో స్క్రీన్‌రైటింగ్ పూర్తి చేసిన జాసన్ సంజయ్, తన తండ్రి స్టార్ ఇమేజ్‌తో సంబంధం లేకుండా ఒక వైవిధ్యమైన కథాంశంతో మెగా ఫోన్ పట్టడం పరిశ్రమలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర టీజర్ మరియు పోస్టర్లు సినిమాపై అంచనాలను భారీగా పెంచేశాయి. ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్ తెలుగు మరియు తమిళ భాషల్లో ఒకేసారి ప్రేక్షకుల ముందుకు రానుంది.




# చిరు చిత్రంలో నివేద?

'మెంటల్ మదిలో', 'బ్రోచేవారెవరురా' లాంటి విజయవంతమైన చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి నివేదా పేతురాజ్. వ్యక్తిగత కారణాలతో మూడేళ్లుగా తెరకు దూరంగా ఉన్న ఈ నాయిక ఇప్పుడు సినీప్రియుల్ని తిరిగి పలకరించేందుకు సిద్ధమవుతోంది. ఆమె ఇప్పటికే తెలుగులో వెంకటేశ్ 'ఆదర్శ కుటుంబం'లో ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిసింది. కాగా, ఇప్పుడామె మరో క్రేజీ సినిమాలోనూ భాగమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం చిరంజీవి కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో ఓ చిత్రం ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తోంది. అనస్వర రాజన్ ముఖ్య పాత్ర పోషిస్తోంది. ఇటీవలే చిత్రీకరణ ప్రారంభించుకున్న ఈ సినిమాలో నివేదా ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. తనిప్పటికే సెట్స్‌లోకి అడుగు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. మాస్ అంశాలతో నిండిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో చిరుకి కుమార్తెగా అనస్వర కనిపించనుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతమందిస్తుండగా.. విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.

## దేవిశ్రీతో ప్రయాణం ముగిసినట్లేనా?

టాలీవుడ్ దర్శకుడు సుకుమార్- సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. 'ఆర్య'తో మొదలైన వీరి ప్రయాణం 'రంగస్థలం', 'పుష్ప' వంటి ఇండస్ట్రీ హిట్స్ వరకు చేరి తెలుగు సినీ పరిశ్రమలో ఓ ప్రత్యేకమైన ముద్ర వేసింది. సుకుమార్ సినిమాలకు దేవిశ్రీ ఇచ్చిన సంగీతం అనేక సందర్భాల్లో సినిమాకే హైలైట్‌గా నిలిచింది. అందుకే ఈ కాంబోకు అభిమానుల్లో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. ఇప్పటివరకు తన సినీ కెరీర్‌లో సుకుమార్ పూర్తి స్థాయిలో దేవిశ్రీ ప్రసాద్‌తోనే ప్రయాణించడం విశేషం. వీరిద్దరి మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్, కథను సంగీతంతో మరింత ఎమోషనల్‌గా ఎలివేట్ చేసే తీరు ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంది. అయితే ఇటీవల కాలంలో ఈ క్రేజీ కాంబినేషన్‌కు బ్రేక్ పడే అవకాశాలున్నాయంటూ ఫిలిం నగర్‌లో జోరుగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా 'పుష్ప-2' నిర్మాణ సమయంలో ఇద్దరి మధ్య కొన్ని విభేదాలు తలెత్తినట్లు ప్రచారం జరిగింది. సినిమాలోని కొన్ని కీలక సన్నివేశాలకు దేవిశ్రీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ విషయంలో సుకుమార్ పూర్తిగా సంతృప్తి చెందలేదని, అందుకే కొన్ని భాగాలకు ఇతర సంగీత దర్శకుల సహాయం తీసుకున్నారనే టాక్ ఇండస్ట్రీలో వినిపించింది. ఈ పరిణామం దేవిశ్రీ ప్రసాద్‌ను అసంతృప్తికి గురిచేసిందని, ఆ బాధను ఆయన ఓ ఈవెంట్‌లో పరోక్షంగా వ్యక్తం చేశారనే చర్చ కూడా జరిగింది. ఇప్పుడు అదే చర్చ మరోసారి హాట్ టాపిక్‌గా మారింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా సుకుమార్ తెరకెక్కించబోయే తదుపరి భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు దేవిశ్రీ ప్రసాద్ స్థానంలో కొత్త సంగీత దర్శకుడిని తీసుకోబోతున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో దేవిశ్రీ ప్రసాద్ 'ఎల్లమ్మ' సినిమాతో హీరోగా కొత్త ఇన్నింగ్స్ ప్రారంభించబోతుండటం కూడా ఈ ప్రచారానికి మరింత బలం చేకూర్చింది.

# క్రైమ్ థ్రిల్లర్‌గా మరీచిక

సంజయ్ అలియాస్ సంజు (విరాజ్ అశ్విన్) ఓ కెఫేని నిర్వహిస్తుంటాడు. అతణ్ని వెంకట లక్ష్మి (అనుపమ పరమేశ్వరన్) ప్రేమిస్తుంది. ఎప్పుడూ అతని కెఫే చుట్టూ తిరుగుతుంటుంది కానీ, తన మనసులోని ప్రేమని మాత్రం వ్యక్తం చేయలేక సతమతమవుతుంది. ఇంతలో వెంకట లక్ష్మికి లండన్ నుంచి వచ్చిన మరీచిక (రెజీనా కసండ్రా) పరిచయమవుతుంది. వెంకటలక్ష్మి కారణంగానే సంజుకి పరిచయం అవుతుంది మరీచిక. ఆ ఇద్దరి మధ్య తక్కువ సమయంలోనే సాన్నిహిత్యం పెరుగుతుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటారు. ఊహించని రీతిలో ఆ ఇద్దరి ప్రేమకు వెంకటలక్ష్మి కూడా సాయం చేస్తుంది. కానీ, అంతలోనే సంజుని మరీచిక దారుణంగా చంపేస్తుంది. కళ్లారా ఆ హత్యని చూసిన వెంకటలక్ష్మి పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని ఫిర్యాదు చేస్తుంది. అసలింతకీ ప్రేమించిన సంజుని మరీచిక ఎందుకు హత్య చేసింది? అసలు మరీచిక ఎవరు? సంజుపై ఉన్న ప్రేమతో వెంకటలక్ష్మి ఏం చేసింది? తదితర విషయాల్ని తెరపై చూసి తెలుసుకోవల్సిందే. ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో ముడిపడిన కథ ఇది. పేరుకు తగ్గట్టే ఎండమావుల్ని గుర్తు చేస్తుంటాయి ఇందులోని సంఘటనలు, పాత్రలన్నీ! సున్నితమైన ఓ




ముక్కోణపు ప్రేమకథలా ప్రారంభమయ్యే సినిమా ఆ తర్వాత అనూహ్యమైన మలుపులతో ఓ క్రైమ్ థ్రిల్లర్‌గా మారిపోతుంది. ప్రధానమైన మూడు పాత్రలూ ఏది నిజం, ఏది అబద్ధం అనే ఉత్కంఠని రేకెత్తిస్తాయి. ఓ థ్రిల్లర్ కథని ప్రేమతో ముడిపెడుతూ రాసుకున్న తీరు ఆసక్తికరంగానే అనిపిస్తుంది. తెరపైన కథ చెప్పే విధానంలో ఎప్పటికప్పుడు మెరుపు వేగంతో మార్పులు చోటు చేసుకుంటాయి. కానీ, ఆ విషయంలో దర్శకుడు పాత పద్ధతుల్నే అనుసరించినట్టు ఈ సినిమా రుజువు చేస్తుంది. ఎ÷-లాష్‌బ్యాక్‌లో వెంకటలక్ష్మి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి ఫిర్యాదు చేసేవరకూ కథ ఊపందుకోదు. అప్పటివరకూ సన్నివేశాలు ఎలాంటి అనుభూతిని పంచకుండా అలా సాగుతూనే ఉంటాయి. హాస్యం, ప్రేమకథల్లోని సంఘర్షణ, కెమిస్ట్రీ తెరపై కనిపించవు. విరామ సన్నివేశాల నుంచే సినిమా కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ద్వితీయార్ధంలో వచ్చే మలుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ. అసలేది నిజమనే ఉత్సుకత రేకెత్తిస్తుంది. దర్శకుడు లాజిక్స్ గురించి పట్టించుకోనేలేదు. ఫిర్యాదు చేయడానికి వెళ్లిన వ్యక్తులు ఏ కథ చెబితే అది పోలీసులు విని అక్కడిక్కడికే కేసుపై ఓ నిర్ణయానికొచ్చేస్తుంటారు. ఆ కేసులో ఉన్న వ్యక్తుల్ని, పరిసరాల్ని కనీసం ఆరా తీయడం కానీ, వివరాలు తెలుసుకోవడం కానీ కనిపించదు. దాంతో తెరపై జరిగే తతంగం అంతా నాటకీయంగానే అనిపిస్తుంది . మొత్తంగా ఈ కథలో థ్రిల్ ఉంది కానీ, తెరపైకి దాన్ని ఇంకాస్త బలంగా చూపించివుంటే బాగుండేది.

**GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/26/A3646 .. Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.